సాక్షి నాగర్‌కర్నూల్

బుధవారం । 12 । జూలై । 2023



షరా మామూలే..!
అక్రమ ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రాలు ప్రజల పాలిట ప్రాణసంకటంగా మారాయి.
వివరాలు 8లో ▸



సన్నద్ధం కావాలి
విద్యుత్‌శాఖ యంత్రాంగం వర్షాకాలానికి సిద్ధం కావాలని సీఎండీ రఘుమారెడ్డి అన్నారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /22.8

వాతావరణం
ఉదయం నుంచి మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.


ఎల్‌ఆర్‌ఎస్‌కు మోక్షం

దరఖాస్తుల పరిశీలనకు మార్గదర్శకాలు విడుదల



అచ్చంపేటలో అనధికార లేవుట్‌లో వెలసిన ప్లాట్లు

- క్రమబద్ధీకరణకు కసరత్తు చేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు
- కమిషనర్లకు ప్రత్యేక లాగిన్ ఇచ్చిన ప్రభుత్వం
- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 56,879 దరఖాస్తులు
- పెండింగ్‌లోనే గ్రామ పంచాయతీ పరిధిలోని అర్జీలు



అచ్చంపేట: రాష్ట్ర ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలు విడుదల చేసింది. టౌన్ ప్లానింగ్ అధికారులు దరఖాస్తులు పరిశీలించి రెగ్యులరైజేషన్ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం మున్సిపల్ అడ్మినిస్ట్రేట్ డిపార్టుమెంట్ ఉన్నతాధికారులు పుర కమిషనర్లకు ప్రత్యేక లాగిన్ సైతం ఇచ్చారు. ఒక్కో దరఖాస్తు పరిశీలించి దరఖాస్తుదారుల నుంచి రెగ్యులరైజేషన్ కోసం రుసుం వసూలు చేయాల్సి ఉంటుంది. మున్సిపాలిటీల పరిధిలో 2020 ఆగస్టు 26 వరకు రిజిస్ట్రేషన్ అయిన అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు జీఓ 131 జారీ చేసింది. 2020 నవంబర్ 10 వరకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించగా.. జిల్లా వ్యాప్తంగా అనధికారిక ప్లాట్లకు సంబంధించి 56,879 దరఖాస్తులు వచ్చాయి.

మూడేళ్లుగా పెండింగ్‌లోనే..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం ఎట్టకేలకు కసరత్తు ప్రారంభించింది. అప్పట్లో చాలా వరకు ప్రజల నుంచి వ్యతిరేకత రావడం, కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వం మూడేళ్లుగా దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి, వాటి వివరాలు ప్రభుత్వానికి పంపించాలని ఈ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్ర మున్సిపల్ ఉన్నతాధికారులు ఆయా మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ చేపట్టి తుది నివేదిక సమర్పించారు. దీంతో రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు కమిషనర్లకు లాగిన్ ఇచ్చింది.

పంచాయతీల్లో ఎప్పుడో..

గ్రామ పంచాయతీల్లోనూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు భారీగా వచ్చాయి. చాలామంది ముందు జాగ్రత్తగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే మొదటి విడతలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అనధికార లే అవుట్లలోని ప్లాట్లను పరిశీలించనున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఈ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియడం లేదు. ఇదిలా ఉండగా.. నిధులు లేక సతమతమవుతున్న మున్సిపాలిటీలకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్రమబద్ధీకరిస్తే భారీగా డబ్బులు సమకూరే అవకాశం ఉంది. ప్లాట్ల క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ప్లాటు మార్కెట్ విలువలో 15 శాతం వసూలు చేయనుంది. దీంతో చాలా పట్టణాల్లోనే ప్లాట్లు అధికంగా ఉండటంతో ఆయా మున్సిపాలిటీలకు రూ.కోట్లలో ఆదాయం సమకూరనుంది.

మొదట క్షేత్రస్థాయి పరిశీలన..



అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణ కసరత్తు చేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేక లాగిన్ ఇచ్చారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీస్తున్నాం. దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చి రెగ్యులైజేషన్ చేస్తాం. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి మొదట క్షేత్రస్థాయి పరిశీలన చేపడతాం. ఎల్‌ఆర్‌ఎస్ కింద ఇప్పటికే రూ.వెయ్యి చెల్లించిన ప్లాట్లు ఏమైనా వివాదంలో ఉన్నాయా అనే అంశం పరిశీలిస్తాం.

– శ్రీహరిరాజు, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

దరఖాస్తుల వెల్లువ

జిల్లాలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో పెద్ద మున్సిపాలిటీలైన నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నుంచి అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. ఖాళీ స్థలాలు ఉన్న ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవడంతో వీటి సంఖ్య పెరిగింది. ప్లాట్ల యజమానులు క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.వెయ్యి చెల్లించగా.. లేవుట్ స్థలానికి గజం చొప్పున, ఏరియాను బట్టి చెల్లించాల్సి ఉంటుంది. వంద గజాల స్థలం క్రమబద్ధీకరించాలంటే.. ప్లాటు రిజిస్ట్రేషన్ విలువ గజం రూ.500 ఉంటే స్పేస్ చార్జీ రూ.8,372, క్రమబద్ధీకరణ చార్జీ రూ.5వేలు, దరఖాస్తు చేసే సందర్భంలో చెల్లించిన రూ.వెయ్యి కలుపుకొని మొత్తం రూ.14,372 చెల్లించాల్సి ఉంటుంది. ప్లాటు విస్తీర్ణం, మార్కెట్ విలువ పెరిగే కొద్ది సహజంగానే క్రమబద్ధీకరణకు చెల్లించాల్సిన మొత్తం కూడా పెరగనుంది. ప్రస్తుతం ప్రభుత్వం వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర భూముల విలువను పెంచడంతో క్రమబద్ధీకరణ చార్జీలు కూడా పెరగవచ్చు.

ఓటరు జాబితా పటిష్టంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

అచ్చంపేట: ఓటరు జాబితా పరిశీలనలో వాస్తవాలను పరిగణలోకి తీసుకొని పర్యవేక్షించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం అచ్చంపేట ఆర్డీఓ కార్యాలయంలో ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల వివరాలపై తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా పటిష్టంగా తయారు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫారం 6 ద్వారా 3,591 నూతన ఓటర్ల నమోదు దరఖాస్తులను రెండు రోజుల్లో పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఒకే ఇంటిలో ఆరుగురు ఓటర్లు ఉంటే తప్పనిసరిగా పరిశీలించాలని, 18 ఏళ్లు నిండిన పీడబ్ల్యూడీ ఓటర్లు ఫారం 8 ద్వారా గుర్తించాలన్నారు. మృతిచెందిన ఓటర్లను ధ్రువపత్రాల ఆధారంగా తొలగించాలని, వలస కూలీలు శాశ్వతంగా వెళ్లిపోతే వారిని గుర్తించి జాబితా నుంచి తొలగించాలన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు 8,028 మంది ఓటర్లు తొలగించగా అందులో 2,241 మంది ఓటర్లు మరణించారని వివరించారు. 3,590 దివ్యాంగుల ఓటరు గుర్తిచేందుకు జాబితాలో ప్రత్యేక సూచికగా ఫ్లాగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఐసీడీఎస్, ఎంపీడీఓలు దివ్యాంగుల అసోసియేషన్స్, ఎన్జీఓల సహకారంతో నివేదిక తయారు చేయాలన్నారు. 265 పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాలని, 2 కి.మీ., దూరంలో కొత్తగా ఏర్పడిన జీపీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, లైటింగ్ వసతులు కల్పించాలన్నారు. ప్రతి మండల పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ తప్పనిసరిగా రూపొందించాలని చెప్పారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఆర్డీఓ రాజేష్‌కుమార్, అచ్చంపేట తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పురుషుల భాగస్వామ్యం అవసరం



వైద్య సిబ్బందికి జ్ఞాపికలు అందజేస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ నియంత్రణలో ఆడవారి కంటే మగవారి భాగస్వామ్యం ఎక్కువ ఉండాలని, వేసెక్టమీ చేయించుకోవడానికి ముందుకు రావాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జనాభా నియంత్రణ కోసం కృషి చేసిన వైద్య సిబ్బందికి అదనపు కలెక్టర్ చేతులమీదుగా అవార్డులు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా నియంత్రణ కోసం శాశ్వత, తాత్కాలిక కు.ని. పద్ధతులు పాటించాలన్నారు. మహిళలు ట్యూబెక్టమీ, పురుషులు వేసెక్టమీ చేయించుకొని జనాభా నియంత్రణకు సహకరించాలని కోరారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీహెచ్ఎస్ నుంచి అవగాహన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రపంచంలో జనాభా పెరుగుదల వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయని, భార్యాభర్తలు కు.ని. పద్ధతులు పాటించాలన్నారు. చిన్న కుటుంబాలు ఉండటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటదాసు, వైద్యులు రవికుమార్, కృష్ణమోహన్, ప్రోగ్రాం అధికారి నర్సింహ, మీడియా అధికారి శివకుమార్ రేణయ్య, బంగారయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు క్రీడా పాఠశాల ప్రవేశానికి ఎంపిక

నాగర్‌కర్నూల్: ఈ నెల 13న క్రీడా పాఠశాల ప్రవేశం కోసం విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు అదనపు కలెక్టర్ మోతీలాల్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో క్రీడా పాఠశాల ప్రవేశాల వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో గురువారం 4, 5 తరగతుల్లో ప్రవేశాల కోసం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్, ప్రోగ్రెస్ రిపోర్టు తీసుకురావాలని సూచించారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

మన్ననూర్: రాష్ట్రంలోని వివిధ పారిశ్రామిక శిక్షణ సంస్థల (ఐటీఐ)లో 2023– 24/ 25 విద్యా సంవత్సరాలకు గాను ఐటీఐ, ఆర్‌ఐటీఐ, మైనార్టీ, ప్రైవేట్‌లో మిగులు సీట్లు భర్తీ చేసేందుకు రెండో విడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మన్ననూర్ ఆర్‌ఐటీఐ ప్రిన్సిపల్ జయమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉండి ఆసక్తి గల విద్యార్థులు బుధవారం నుంచి ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు కుల, స్థానిక సరిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోను స్కాన్ చేసి http://iti.telangana,gov.in వెబ్‌సైట్‌లో మొబైల్ నంబర్‌తో రిజిష్టర్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నం.80960 35178, 63006 19644లను సంప్రదించాలని సూచించారు.

ఫైర్‌స్టేషన్ అధికారికి రాష్ట్రస్థాయి సేవా పతకం



పీవీ నర్సింగ్‌రావు

కొల్లాపూర్: అగ్నిమాపక శాఖలో విశిష్ట సేవలు అందించిన వారికి ఆ శాఖ అధికారులు పతకాలను ప్రకటించారు. ఇందులో భాగంగా కొల్లాపూర్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ పీవీ నర్సింగ్‌రావుకు రాష్ట్రస్థాయిలో సేవా పతకం లభించింది. నర్సింగ్‌రావు 1993 బ్యాచ్‌లో ఫైర్‌మెన్‌గా విధుల్లో చేరారు. సనత్‌నగర్, పంజాగుట్ట, మౌలాలి, గౌలిగూడ, నాగర్‌కర్నూల్ ఫైర్ స్టేషన్లలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఏడాది క్రితం కొల్లాపూర్ స్టేషన్‌కు ఎస్ఎఫ్ఓగా బదిలీపై వచ్చారు. సేవా పతకం ప్రకటించినందుకు అగ్నిమాపక శాఖ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విధి నిర్వహణలో మరింత అంకితభావంతో పనిచేసేందుకు ఇది దోహదపడుతుందన్నారు. ఆయనకు సేవా పతకం లభించడం పట్ల స్థానిక ఫైర్ స్టేషన్ ఉద్యోగులు హర్షం వెలిబుచ్చారు.

పెచ్చులూడిన తహసీల్దార్ కార్యాలయ గది పైకప్పు



తెలకపల్లి: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఓ గది పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. గత కొన్నేళ్ల నుంచి కార్యాలయంలోని కొన్ని గదుల పైకప్పు పెచ్చులు ఊడిపడుతూ ప్రమాదభరితంగా మారింది. ఈ క్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ అధికారులు విధులు నిర్వహించే గది పైకప్పు పెచ్చులు ఊడిపడేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అధికారులు భయాందోళనకు గురయ్యారు. కాగా ఒక్కసారిగా గది పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో అధికారులు, ప్రజలు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కూలుతుందేమోననే అనుమానంతో రెండు రోజుల నుంచి ఆ గదిలోకి ఎవరూ వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పిందని ఆర్ఐ రామస్వామి తెలిపారు.

ఆర్టీసీ డీఎంల బదిలీలు

నారాయణపేట రూరల్: ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ డీఎంలను బదిలీచేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నారాయణపేట డీఎం ఆంజనేయులు కాచిగూడకు బదిలీకాగా, ఆయన స్థానంలో ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి లక్ష్మీసుధను కేటాయించారు. వనపర్తి డీఎం జి.పరమేశ్వరిని హెడ్ ఆఫీస్‌లో ఏటీఎంగా బదిలీ చేయగా.. ఆమె స్థానంలో హెడ్ ఆఫీస్ నుంచి వేణుగోపాల్ నియమితులయ్యారు. నాగర్‌కర్నూల్ డీఎం ధరమ్‌సింగ్‌ను హన్మకొండకు, గద్వాల డీఎం శ్రీనివాస్‌ను ఉప్పల్‌కు పంపించగా.. కొత్త వారిని ఇవ్వాల్సి ఉంది.

సమగ్ర శిక్ష అభియాన్ పోస్టులకు కౌన్సెలింగ్



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న జెడ్పీ సీఈఓ ఉష, డీఈఓ గోవిందరాజులు

కందనూలు: విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న 21 సమగ్ర శిక్ష అభియాన్ పోస్టుల భర్తీకి మంగళవారం కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ ఉష, డీఈఓ గోవిందరాజులు కౌన్సిలింగ్ నిర్వహించి నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి మేరకు సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వుల ప్రకారం డాటా ఎంట్రీ ఆపరేటర్, సిస్టం ఎనాలసిస్ట్, ఎంఐఎస్ కోఆర్డీనేటర్, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్, ఇంక్లూసివ్ ఎడ్యూకేషన్ రిసోర్స్‌పర్సన్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసేందుకు ప్రభుత్వం 2019 నవంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో దరఖాస్తులు స్వీకరించి, రాత పరీక్ష నిర్వహించి మెరిట్ జాబితా సైతం ప్రకటించారు. ఆ తర్వాత వివిధ కారణాలతో ఈ నియమాక ప్రక్రియను నిలిపివేసిన రాష్ట్ర విద్యాశాఖ ప్రస్తుతం జిల్లా పరిధిలోని 21 పోస్టులకు సంబంధించిన 17 మంది అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి కలెక్టర్ ఆమోదంతో నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ నూరుద్దీన్, కోఆర్డినేటర్ వెంకటయ్య, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి, జెడ్పీ సూపరింటెండెంట్ యూసుఫ్, సెక్షన్ క్లర్క్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయతను వెలికితీయాలి



మాట్లాడుతున్న సైన్స్ అధికారి కృష్ణారెడ్డి

అచ్చంపేట: విద్యార్థుల్లో శాస్త్రీయత దృక్పథాన్ని వెలికితీసి వారిని బాల శాస్త్రవేతలుగా తీర్చిదిద్దాలని జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అచ్చంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇన్‌స్పైర్ అవార్డు, ఇంటింటా ఇన్నోవేటర్ నమోదు కార్యక్రమాలపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ స్కూళ్ల సైన్స్, గణిత ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నామినేషన్ చివరి తేదీ ఆగస్టు 31 అయినప్పటికీ ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు నామినేషన్లు తప్పనిసరిగా పూర్తిచేయాలని, ఇందుకోసం విద్యార్థుల మధ్య పోటీలు నిర్వహించి బెస్ట్ ఐడియాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఇన్నోవేషన్ అనేది పాఠశాల స్థాయి నుంచే ప్రారంభం కావాలన్నారు. పాఠశాల విద్యార్థులకే కాకుండా ప్రజలు కూడా వారికి వచ్చిన ఐడియాలను వీడియో రూపంలో తయారు చేసి ఆగస్టు 5 వరకు వివరాలను సెల్ నం.91006 78543కు వాట్సప్ ద్వారా పంపవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రామారావు, హెచ్ఎంలు శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీకి బీటీం బీఆర్‌ఎస్

కందనూలు: బీజేపీకి బీఆర్‌ఎస్ బీటీం అని మరోసారి నిరూపితమైందని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా బుధవారం 'సత్యాగ్రహ దీక్ష'కు పిలుపునిస్తే.. బీఆర్‌ఎస్ ఉచిత విద్యుత్ పైకి ప్రజల దృష్టి మరల్చాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ పేరుతో రైతులను మోసం చేస్తుందని, 12 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వడం లేదన్న విషయం ఏ సబ్‌స్టేషన్‌కు వెళ్లినా తెలుస్తుందని చెప్పారు. తొమ్మిదేళ్లలో విద్యుత్ సంస్థలను రూ.60 వేల కోట్ల అప్పుల్లో ముంచి తన అవినీతికి విద్యుత్ రంగాన్ని బలిపెట్టిన ఘనుడు కేసీఆర్ అన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ మోసాలకు నిరసనగా జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో సబ్‌స్టేషన్ల ఎదుట కేసీఆర్ దిష్టిబొమ్మ దహనానికి, అలాగే రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా 'సత్యాగ్రహ దీక్ష'కు పిలుపునిస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఆదరించాలి

- కొల్లాపూర్‌లో బహిరంగసభను జయప్రదం చేద్దాం
- మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు



కొల్లాపూర్‌లో బహిరంగ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న కృష్ణారావు తదితరులు

కందనూలు/ వనపర్తి/ కొల్లాపూర్/ పాన్‌గల్/ చిన్నంబావి/ వీపనగండ్ల: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కలను సాకారం చేసిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవడానికి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వచ్చిన వారు ముందుగా నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వనపర్తికి బయలుదేరారు. అక్కడి నుంచి పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మీదుగా కొల్లాపూర్‌కు వెళ్లి ఈ నెల 20 నిర్వహించే ప్రియాంకా గాంధీ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. పాన్‌గల్‌లో ఏఐసీసీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేష్, చిన్నంబావిలో రంగినేని అభిలాష్‌రావుల ఇళ్లకు వెళ్లి వారిని కలిశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జూపల్లి మాట్లాడుతూ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన బీఆర్‌ఎస్‌కు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదన్నారు. సోనియాగాంధీ కాళ్లపై పడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న కేసీఆర్ కపట బుద్ధి ప్రదర్శించారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు కాంగ్రెస్ పార్టీకి పట్టుగొమ్మలన్నారు. రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, నిరుద్యోగ భృతి, పింఛన్లు రూ.4,016 వంటి పథకాలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కొల్లాపూర్‌లో నిర్వహించే బహిరంగ సభకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

సభాస్థలి పరిశీలన

ఈ నెల 20న నిర్వహించే బహిరంగ సభ కోసం కొల్లాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో స్థలాన్ని జూపల్లి కృష్ణారావుతోపాటు మాజీ ఎమ్మెల్యేలు సంపత్‌కుమార్, ఎర్రశేఖర్, వంశీకృష్ణ పరిశీలించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు సభకు తరలివస్తారన్నారు. కొల్లాపూర్ సభ నుంచే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు దిశానిర్దేశం జరుగుతుందని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఒబేదుల్లా కొత్వాల్, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి, కిచ్చారెడ్డి, డీసీసీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, నాయకులు నరేందర్, ఫరీద్‌అహ్మద్, గంగాధర్‌యాదవ్, లక్ష్మయ్య, జంగయ్యచారి, పాపిరెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణప్రసాద్‌యాదవ్, బీచుపల్లియాదవ్, రంజిత్‌కుమార్, తేజరెడ్డి, రాజుకుమార్, సతీష్, శివ, కాశీ తదితరులు పాల్గొన్నారు.

■ కాంగ్రెస్ పార్టీలో చేరే నేపథ్యంలో ఢిల్లీకి వెళ్లిన జూపల్లి కృష్ణారావు తొలిసారి సొంత నియోజకవర్గం నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్‌కు సుమారు 250 వాహనాలతో భారీ ర్యాలీగా వనపర్తి మీదుగా వెళ్లారు. మార్గమధ్యలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎంపీపీ మేఘారెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తనతోపాటు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు జూపల్లి వెల్లడించారు.

16న సాయిచంద్ సంతాప సభ

కందనూలు: ప్రముఖ కవి, గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ సంతాప సభను ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు తెలంగాణ దళిత సమాఖ్య అధ్యక్షులు కాశన్న తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని స్థానిక కవులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సంతాప సభకు ముఖ్య అతిథులుగా ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం, సినీ రచయిత మిట్టపల్లి సురేందర్ హాజరవుతారన్నారు. సాయిచంద్ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు అని, అతని ఆటపాటల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచి.. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సంతాప సభకు జిల్లాలోని కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సంతాప సభ వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య, సీనియర్ జర్నలిస్ట్ మోహన్, కవులు వహీద్‌ఖాన్, మద్దిలేటి, నాయకులు రామచందర్, వెంకటయ్య, విజయ్, వెంకటయ్య, నంది పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

డీజిల్ ఇంజిన్‌కు చీర చుట్టుకొని మహిళ మృతి

ఎర్రవల్లిచౌరస్తా: పొలం దగ్గర రన్నింగ్‌లో ఉన్న డీజిల్ ఇంజిన్‌కు చీర చుట్టుకొని మహిళ మృతి చెందిన ఘటన కోదండాపురం సీఏసీ పరిదిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటస్వామి కథనం ప్రకారం.. మండల పరిదిలోని ఆర్ గార్లపాడుకు చెందిన సుమిత్రమ్మ (39) కుటుంబ సభ్యులతో సోమవారం పొలానికి వెళ్లింది. ఈ క్రమంలో సాయంత్రం ప్రమాదవశాత్తు రన్నింగ్‌లో ఉన్న డిజిల్ ఇంజన్‌కు ఆమె చీర చుట్టుకోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం (45)

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని విద్యానగర్ కాలనీ ఖాళీస్థలంలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. విద్యానగర్ కాలనీ మహబూబ్‌నగర్ రోడ్డు పక్కనున్న హరికృష్ణ కిరాణం వెనక ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి పడుండడంతో కాలనీవాసులు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా అతను మృతి చెంది ఉన్నాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు, ఆనవాళ్లు లేకపోవటంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తుపడితే కల్వకుర్తి ఎస్‌ఐ 8712657752 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గోపాల్‌పేట : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన వనపర్తి జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వనపర్తి టౌన్ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి వివరాల ప్రకారం.. వనపర్తిలోని రాయిగడ్డ నడిమిగేరికి చెందిన నరసింహ్మ (40) అతని భార్య శివమ్మతో కలిసి సోమవారం పనిమీద ఇంటి నుంచి బయటికొచ్చారు. ఆ తర్వాత శ్రీ బాలాజీ వైన్స్ దగ్గర మద్యం తాగారు. రాత్రి వరకు అక్కడే ఉన్నారు. మంగళవారం ఉదయం శివమ్మ లేచి చూసే సరికి భర్త మృతి చెందాడు. నరసింహ్మ మృతిపై అనుమానం ఉందని తండ్రి గోకం స్వామి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి బలవన్మరణం



మహేష్ గౌడ్(ఫైల్)

చారకొండ: మండల కేంద్రానికి చెందిన బురేల మహేష్‌గౌడ్(26) ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇంటి పక్కన ఉన్న వారు గుర్తించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాలు.. చారకొండకు చెందిన యువకుడు మహేష్ తల్లిదండ్రులు గతేడాదే మృతి చెందారు. తమ్ముడు రాకేష్ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇంటివద్ద ఒంటరిగా ఉంటున్న మహేష్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇంటి పక్కనవారు స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ రవి .పోలీస్ సిబ్బంది పరిశీలించారు. సంఘటనపై తమ్ముడు, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రవి తెలిపారు.

జంతువుల దాడిలో దూడ మృతి

వెల్దండ : అడవి జంతువులు దాడిలో దూడ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొట్ర గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కడారి పెద్దయ్య సోమవారం రోజువారీగా పాలకోసం ఆవుల షెడ్ వద్దకు వెళ్లాడు. అప్పటికే దూడ మృతి చెందినట్లు గుర్తించాడు. దూడ మృతి చెందడంతో గేదె పాలు ఇవ్వలేదన్నాడు. పాలు అమ్మి బతికే పెద్దయ్యకు నష్టం జరిగిందని, ప్రభుత్వ పరంగా బాధితున్ని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



దేవరకద్ర: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. నారాయణపేట జిల్లా అనుమతితో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి ఇసుకను తరలిస్తుండగా తహసీల్దార్ జ్యోతి పట్టుకోని విచారించారు. టిప్పర్‌ను పోలీసు స్టేషన్ తరలించారు. ప్రభుత్వ పనుల కోసం షాంపిల్‌గా ఇసుకను తరలిస్తున్నట్లు టిప్పర్ యజమాని తెలిపారు. ఇసుకకు అనుమతి పత్రాలు కావాలని తహసీల్దార్ పేర్కొన్నారు. పత్రాలు చూపించక పోవడంతో టిప్పర్ యజమానికి రూ.25 వేల జరిమానా విధించి, డీడీ రూపంలో చెల్లించాలని ఆదేశించారు. రెండు వారాల క్రితం ఇలాగే వచ్చిన 6 టిప్పర్ల ఇసుకను రెవెన్యూ అధికారులు పట్టుకుని రూ.1.50 లక్షల జరిమానా విధించారు.

కాలుష్య పరిశ్రమలు వద్దు

- ప్రజాభిప్రాయసేకరణలో పలువురు రైతుల ఆవేదన

జడ్చర్ల: పోలేపల్లి సెజ్‌లో కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలు వద్దని, కాలుష్యం లేని పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాడు పరిశ్రమల కోసం అన్నం పెట్టే భూములు అప్పగిస్తే నేడు మాకు ఆ పరిశ్రమల్లో ఉద్యోగాలివ్వక పోగా, కూలీ పనులకు కూడా రానివ్వడం లేదంటూ పలువురు రైతులు సోమవారం ప్రజాభిప్రాయ సేకరణలో అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు.

16 ఎకరాల భూమి పోయింది..



మాకున్న 16 ఎకరాల భూమి సెజ్‌లో పోయింది. ఒక్క గుంట భూమి కూడా మిగలలేదు. కనీసంగా కంపెనీల్లో పనికి పోదామంటే రానివ్వడం లేదు. ఇతరప్రాంతాల వారిని తీసుకొచ్చి కంపెనీల్లో పని చేయిస్తున్నారు. మా తండా పేరు చెబితేనే మండి పడుతున్నారు. భూములు పోయినప్పుడు జాబ్ కార్డులు కూడా ఇచ్చారు. ఎలాగైనా మాకు ఉపాధి చూపించాలి. – రాము, పోలేపల్లి తండా

ఫార్మ కంపెనీల్లో కాలుష్యం వస్తోంది



పోలేపల్లి సెజ్ ఫార్మ కంపెనీలు తీవ్ర కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. వ్యర్థ జలాలు పంట భూములను నాశనం చేస్తున్నాయి. భూములు అమ్ముకోని ఎక్కడికైనా వెళ్లి పోయే పరిస్థితి దాపురించింది. – గంగాధర్ గౌడ్, సర్పంచ్, రాయపల్లి

ఫిర్యాదు చేసినా పట్టింపు లేదు..



సెజ్‌లోని ఫార్మ పరిశ్రమల కాలుష్యంపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. వ్యర్థ జలాల వల్ల భూగర్భ జలాలు కలుషితంగా మారాయి. చాలాసార్లు కలెక్టర్, పీసీబీ అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేదు. కాలుష్యం లేని పరిశ్రమలను ఏర్పాటు చేస్తే స్వాగతిస్తాం. – యాదయ్య, మాజీ ఎంపీటీసీ, పోలేపల్లి

జీవరాసుల మనుగడకే ముప్పు..



ఫార్మ పరిశ్రమలు వ్యర్థ జలాలను బయటకు వదలడం వల్ల అవి చెరువులు, కుంటల్లోకి చేరుతోంది. ఆ నీటిని తాగిన పశువులు, జీవరాసులు చనిపోతున్నాయి. పీసీబీ ఈఈ దృష్టికి ఈ సమస్యను ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. – రాజు, ముదిరెడ్డిపల్లి

అధికారులపై చర్యలు తీసుకోవాలి



ప్రజల సమస్యలు పరిష్కారం చేయని అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలి. సెజ్ కాలుష్యంపై పీసీబీ ఈఈకి చెబుదామంటే నా నంబర్ బ్లాక్ చేశారు. కాలుష్య పరిశ్రమల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాలి. మాకు న్యాయం కోసం ఎన్‌జీటీని ఆశ్రయించాం. – కోస్గి వెంకటయ్య, ముదిరెడ్డిపల్లి

యువతకు ఉద్యోగాలేవి..?



పరిశ్రమల ఏర్పాటుకు వేయి ఎకరాలిస్తే ఇక్కడి యువతకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. పరిశ్రమలకు భూములు మేమిస్తే ఉద్యోగాలు పరాయి వారికి ఇస్తున్నారు. కాలుష్యంపై అధికారులు నోరు మెదపడం లేదు. – కే.యాదయ్య, పోలేపల్లి

కోనోకార్పస్ చెట్లను నిషేధించాలి



కాలుష్య పరిశ్రమల కారణంగా పర్యావరణం దెబ్బతిన్నది. కోనోకార్పస్ చెట్లను నిషేధించాలి. ఈ చెట్లపై కీటకాలు, పక్షులు కూడా ఉండవు. ఈ చెట్లు పర్యావరణానికి హానీ కలిగిస్తాయి. వాటితో జీవ వైవిధ్యం దెబ్బతినే ప్రమాదముంది. – ఎం.సత్యనారాయణ, ఎన్‌జీఓ, నల్లగొండ

రూ.వెయ్యికోట్ల పరిహారానికి దావా



పోలేపల్లి సెజ్ కాలుష్య పరిశ్రమలపై జడ్చర్లకు చెందిన ఓ న్యాయవాది సుప్రీం కోర్టులో రూ.వేయి కోట్ల పరిహారం కోసం దావా వేశాడు. సుప్రీం కోర్టు ఆదేశాలతో ఆ పరిహారాన్ని నిర్వాసిత రైతులకు పంపిణీ చేయడం జరుగుతుంది. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించిన పరిశ్రమలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. – పీఎల్ఎస్ రావు, సామాజిక కార్యకర్త

ఉదండాపూర్ రిజర్వాయర్ పక్కనే అనుమతులా..?



ఉదండాపూర్ రిజర్వాయర్ పక్కనే బల్క్ డ్రగ్ పరిశ్రమకు అనుమతిచ్చారు. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు వ్యతిరేకించినా అనుమతులిస్తున్నారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా మొక్కుబడిగా ఈఐఏ ఏర్పాటు చేశారు. కాలుష్యంపై ఎన్‌జీటీలో న్యాయ పోరాటం చేస్తున్నాం. తాము లేవనెత్తిన అంశాలను సరిదిద్దేందుకే ఈ అభిప్రాయ సేకరణ చేపట్టారు. 2007లో ప్రజల అభిప్రాయాలు సేకరించాల్సి ఉండగా, 16 ఏండ్ల తరువాత ఇప్పుడు సేకరించడం విచిత్రంగా ఉంది. – సునీల్, ఎన్‌జీటీ అడ్వకేట్ ప్రతినిది, జడ్చర్ల

పనికోసం వెళ్తే గెంటేస్తున్నారు..



ఉన్న భూమి సెజ్‌లో పోయింది. బతుకు దెరువు కోసం కూలీ పనులు చేద్దామంటే కంపెనీ గేటు కూడా దాటనీయడం లేదు. పనుల కోసం ప్రాదేయపడుతున్నా.. గేటు బయటికి గెంటేస్తున్నారు. ఎలాగైనా నాకు పని ఇచ్చి జీవనోపాధి కల్పించాలి. – మంగీ, గుండ్లగడ్డతండ

పర్యావరణాన్ని పరిరక్షించాలి



సమస్త ప్రాణకోటికి పర్యావరణం అవసరం. పోలేపల్లి సెజ్‌లో పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. ఇక్కడ ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే రావి, వేప, మర్రి, తదితరచెట్ల పెంపునకు చర్యలు తీసుకోవాలి. – ఏ.వెంకటరెడ్డి, ఎన్‌జీఓ, నల్లగొండ

ఇద్దరు అదృశ్యం

మహబూబ్‌నగర్ క్రైం: భార్యాభర్తలు గొడవపడి ఇంట్లో నుంచి భర్త వెళ్లిపోయిన ఇంటికి తిరిగి రాలేదు. కోయిలకొండ ఎక్స్‌రోడ్ ప్రాంతానికి చెందిన కిష్టమ్మ అనే వృద్ధురాలు ఇంటి నుంచి వెళ్లిపోయింది. వన్ టౌన్ ఎస్‌ఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బండ్లగేరికి చెందిన సుశీల, వెంకటేష్ భార్యాభర్తలు. వెంకటేష్ టైలరింగ్ చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో నెల రోజులుగా టైలరింగ్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. భర్త పనికి వెళ్లకపోవడంతో భార్య సుశీల ప్రైవేట్ ఆస్పత్రిలో పనికి వెళ్తోంది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈనెల 10న ఇద్దరి మధ్య గొడవ కావడంతో కోపంగా వెంకటేష్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో బంధువుల వద్ద. ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య సుశీల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కోయిలకొండ ఎక్స్‌రోడ్ ప్రాంతానికి చెందిన కిష్టమ్మ అనే వృద్ధురాలు ఈనెల 1న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో గతంలో పలుమార్లు వెళ్లి ఒకటి రెండు రోజుల్లో తిరిగొచ్చేది. ఇప్పుడు తిరిగి రాకపోవడంతో కొడుకు శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

బెల్లం పట్టివేత



అమ్రాబాద్ : అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటికను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం అమ్రాబాద్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మన్ననూర్ నుంచి అమ్రాబాద్ వైపు వెళ్తున్న టీవీఎస్ వాహనంలో 1.20 క్వింటాళ్ల నలకల బెల్లం, పది కిలోల పటికను పట్టుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకొని తరలిస్తున్న నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాదయాత్ర



యువకుడిని స్వాగతం పలుకుతున్న స్థానికులు

పెబ్బేరు: పర్యావరణ పరిరక్షణ కోసం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య నగరానికి చెందిన అషిత్ పాండే పాదయాత్ర చేపట్టాడు. మంగళవారం అతనికి పట్టణ ప్రజలు స్వాగతం పలికారు. అయోధ్య నుంచి 2022 డిసెంబర్ 4వ తేదీన పాదయాత్ర చేపట్టానని, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, కలెక్టర్లను కలుసుకుంటూ 2026లో మళ్లీ అదే అయోధ్య నగరంలో ముగింపు చేయనున్నట్లు తెలిపారు. 16వేల కిలోమీటర్ల పాదయాత్ర చేయడం లక్ష్యంగా పెట్టుకున్నానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని, వనాలు, కొండలు, వాగులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బయ్యశెట్టి, ఎండి ఖాజా, కౌన్సిలర్ చిన్నా ఎల్లారెడ్డి, మేకల యల్లయ్య, వెంకటస్వామి, శ్రీనివాస్‌గౌడ్, బాలరాజు, రాముడు పాల్గొన్నారు.

భీమానది వెలవెల..



భీమానదిలో నీళ్లులేక వట్టిపోయిన వైనం.గుంతలో నిల్చిన నీటిని తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న తీర ప్రాంత రైతులు

- నీటి కోసం రైతులు ఇబ్బందులు
- వట్టిపోతున్న వరి నారుమళ్లు

కృష్ణా: మండలంలోని భీమానదిలో నీరు లేక వెలవెల బోతోంది. వారం రోజులుగా వర్షాల్లేవు, నదిలో నీరులేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నదీతీర ప్రాంతాల్లో ఇప్పటికే నారుమళ్లు పోయడంతో నీళ్ల లేక ఎండుతున్నాయి. నదీతీర ప్రాంత రైతులు మంగళవారం నదిలో అక్కడక్కడ నిల్చిన నీటిని తోడుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. గతంలో వేసవిలో మాత్రమే ఇలాంటి ఇబ్బందులుండేవి. ఇప్పుడు వర్షకాలం ప్రారంభమై నెలరోజులైనా నదిలో నీళ్ల లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భీమానదిపై ప్రతి 10 కిలోమీటర్లకూ ఒక బ్రిడ్జి కం బ్యారేజీ ఉండడమే ఇందుకు కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

అడ్డాకుల: ప్రైవేటు బడిలో చదువుకునే తన పిల్లలకు స్కూల్ యూనిఫాం కొనిచ్చి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందాడు. ఈ సంఘటన మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ భాస్కర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బి.దిలీప్‌గౌడ్(33), స్వాతి దంపతులకు ఇద్దరు కుమారులు. అడ్డాకులలోని ఓ ప్రైవేటు పాఠశాలకు బస్సులో వెళ్లి చదువుకుంటున్నారు. పిల్లలకు స్కూల్ యూనిఫాం ఇప్పించడానికి దిలీప్‌గౌడ్ మంగళవారం సాయంత్రం బైక్‌పై అడ్డాకుల వెళ్లాడు. తిరిగి ఇంటికి తిరిగి వస్తూ కొమిరెడ్డిపల్లి వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో తల, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స అందేలోపు చనిపోయాడు. ఈ సంఘటనతో కొమిరెడ్డిపల్లి గ్రామంలో విషాదం అలుముకుంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెబ్బేరు: మండల పరిధిలో రంగాపూర్‌లోని వెంకటసాయి రైస్‌మిల్లులో మంగళవారం సివిల్ సప్లయ్ అధికారులు, పోలీసులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గద్వాల జిల్లా కేటిదొడ్డి గ్రామానికి చెందిన కుర్వ విష్ణు బొలెరో వాహనంలో 32 క్వింటాల 45 కేజీల రేషన్ బియ్యంతో మంగళవారం తెల్లవారుజామున వెంకటసాయి రైస్‌మిల్లు దగ్గర ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో వెళ్లారు. బియ్యం దించుతుండగా పరిశీలించి, మిల్లును సీజ్ చేశారు. యజమాని వెంకట్రామిరెడ్డి, వాహనం డ్రైవర్ కుర్వ విష్ణుపై కేసులు నమోదు చేశారు. సివిల్ సప్లయ్ అధికారులు డీటీలు వేణునాయుడు, నందకిశోర్, పోలీసులు ఉన్నారు.

మిషన్ భగీరథ ఏఈ ఆత్మహత్య



భరత్‌కుమార్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం/ మిడ్జిల్: రెండు వివాహాలు చేసుకున్న పిల్లలు కావడం లేదని మనస్తాపం తో ఫ్యాన్‌కు ఉరేసుకొని మిషన్ భగీరథ ఏఈ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన చెన్నారపు భరత్‌కుమార్(37) మిడ్జిల్‌లో మిషన్ భగీరథ ఏఈగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు 2013లో అచ్చంపేటకు చెందిన దీపికతో పెళ్లి జరిగింది. కొంతకాలం తర్వాత సంతానం కాకపోవడంతో విడాకులు తీసుకున్నారు. నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన ఆశను పెళ్లి చేసుకున్నాడు. పిల్లల కోసం చాలా ఆస్పత్రులు తిరిగారు. అయినా పిల్లలు పుట్టలేదు. దీంతో పిల్లలు కావడం లేదనే మనోవేదనతో ఉన్నాడు. మంగళవారం తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని తల్లి చెన్నారపు సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కప్లాపూర్‌లో పర్యటించిన అధికారులు

- రెండు రోజులు గ్రామంలో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్..



కప్లాపూర్‌లో డెంగీ బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

గండీడ్: మండల పరిదిలోని కప్లాపూర్ గ్రామంలో డెంగీ ప్రబలిన విషయాన్ని సాక్షి వెలుగులోకి తీసుకొచ్చింది. సోమవారం సాక్షిలో ‘కప్లాపూర్‌లో డెంగీ’ అనే శీర్షికతో కథనం వెలువడింది. వెంటనే స్థానిక, జిల్లా అధికారులు స్పందించి గ్రామంలో పర్యటించారు. జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి రమేష్, మండల వైద్యాధికారి చంద్రశేఖర్ వైద్య బృందంతో గ్రామానికి చేరుకొని బాధితులతో వివరాలు సేకరించారు. డెంగీ ప్రబలడానికి గల కారణాలపై ఆరా తీశారు. వారికి సంబంధించిన రిపోర్టులను పరిశీలించారు. ప్రస్తుతం నీలోఫర్‌లో చికిత్స పొందుతున్న ప్రియదర్శిని డెంగీ బారిన పడ్డట్లు వైద్యులు గుర్తించారు. కొందరికి వైరల్ ఫీవర్ ఉన్నట్లు గుర్తించారు. గ్రామంలో రెండు రోజుల పాటు క్యాంపు నిర్వహిస్తామని వైద్యాధికారి తెలిపారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి పూర్తిస్థాయి సర్వే చేస్తామన్నారు. దోమల నివారణకు స్ప్రే, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. నీరు నిల్వ ఉండకుండా గ్రామస్తులు జాగ్రత్తలు తీసుకోవాలని, శుద్ధి చేసిన మంచినీటిని తాగాలని వైద్యులు గ్రామస్తులకు సూచించారు. గ్రామం అంతటా పారిశుద్ధ్యానికి చర్యలు చేపట్టాలని సర్పంచ్ అరుణజ్యోతికి, కార్యదర్శికి వైద్యాధికారి సూచించారు.

షరా మామూలే..!



మహబూబ్‌నగర్ రూరల్ మండలం మాచన్‌పల్లిలో ఫిల్టర్ ఇసుక కోసం తవ్విన గుంత (ఫైల్)

- మృత్యువు కూపంగా మారిన ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రాలు
- అధికారుల అండదండలతో రెచ్చిపోతున్న మాఫియా
- మామూళ్ల మత్తులో రెవెన్యూ, పోలీస్ శాఖలు



ఇసుకగా మార్చేందుకు మట్టి తీసుకువస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

మహబూబ్‌నగర్ రూరల్: తిలాపాపం.. తలపిడికెడు అన్న చందంగా అక్రమ ఫిల్టర్ ఇసుక రవాణ జిల్లాకేంద్రానికి చుట్టుపక్కల మండలాలు, గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతుంది. కొన్నిచోట్ల ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రాలు ప్రజలకు ప్రాణసంకటంగా మారాయి. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రం చుట్టుపక్కల గల హన్వాడ, మహబూబ్‌నగర్ అర్బన్, మహబూబ్‌నగర్ రూరల్, నవాబుపేట, కోయిలకొండ, హన్వాడ మండలాల్లో పదుల సంఖ్యలో ఎక్కడా చూసినా ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రాలు నడుస్తున్నాయి. మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని బోయపల్లి, పిల్లలమర్రి, దొడ్డలోనిపల్లి, మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని మాచన్‌పల్లి, ఓబ్లాయిపల్లి, కోటకదిర, రామచంద్రాపూర్, కోడూర్, కోటకదిర, జైనల్లీపూర్, వెంకటాపూర్, లాల్యానాయక్‌తండా, మాచన్‌పల్లితండా, రేగడిగడ్డతండా, కోయిలకొండ మండలంలోని ఆచార్యపూర్, జైభవానిసాగర్ పరిసర ప్రాంతాలు, హన్వాడ మండలంలోని చిన్నదర్పల్లి, గొండ్యాల తదితర ప్రాంతాల్లో కొన్నేళ్ల నుంచి ఈ అక్రమ దందా కొనసాగుతుంది. ప్రభుత్వ పరంగా ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమార్కులు తమ తమ ప్రాంతాల్లో కొందరు అధికార పార్టీ నాయకులు, అధికారుల అండదండలు చూసుకొని ఇష్టారాజ్యంగా చీకటి వ్యాపారం సాగిస్తుండటం వల్ల చివరికి పేద ప్రజల ప్రాణాల మీదకు వచ్చే పరిస్థితి దాపురించింది.

ఎవరి వాటాలు వారికి..

తాజాగా మంగళవారం హన్వాడ మండలం చిన్నదర్పల్లిలో ఫిల్టర్ ఇసుక తయారీ గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన ఆందోళన కలిగిస్తోంది. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులతో లోపాయికారి ఒప్పందం వల్లే ఫిల్టర్ ఇసుక మాఫియా రెచ్చిపోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ, అసైన్డ్, అటవీ, పట్టా భూములు అనే తేడా లేకుండా అక్రమార్కులు నీటి వనరు కనిపిస్తే చాలు అక్కడే గుంతలు తయారు చేసుకొని ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రాలను ఏర్పర్చుకున్నారు. తవ్విన నీటి గుంతల్లో మట్టిని ఫిల్టర్ చేసి ఆ తర్వాత ఇసుకగా మారిన దానిని కుప్పలుగా పోసి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా అమ్ముకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.4– 6 వేలు, టిప్పర్ ఇసుకకు రూ.25– 28 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమ వ్యాపారం కోసమే కొంతమంది అధికార పార్టీలో చేరి అధికారులను మచ్చిక చేసుకొని యథేచ్ఛగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తుండటం గమనార్హం. ప్రతినెలా ఠంఛన్‌గా ఎవరి వాటాలు వారికి అందుతుండటంతో ఈ వ్యాపారం ఎలాంటి ఆటంకం లేకుండా దినదినాభివృద్ధి చెందుతూ వస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇద్దరు చిన్నారుల ప్రాణాలు బలిగొన్న ఫిల్టర్ ఇసుక వ్యాపారంపై ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఉక్కుపాదం మోపుతారా.. లేదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

భూమి కోసం తల్లిని హతమార్చిన కొడుకు



చిలకమ్మ(ఫైల్)

లింగాల: భూ తగాదాతో క్షణికావేశానికి గురైన కుమారుడు తల్లిని కర్రతో తలపై మోది హత్య చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వల్లభాపూర్‌కు చెందిన బండపల్లి చిలకమ్మ(54), చిన్నయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండేళ్ల క్రితం చిన్నయ్య మృతి చెందాడు. కాగా.. భర్త పేరుమీద ఉన్న 2.20ఎకరాల భూమిన తన పేరు మీదికి మార్చుకునేందుకు చిలకమ్మ ధరణిలో స్లాట్ బుక్ చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పెద్ద కుమారుడు తిరుపతి మంగళవారం రాత్రి తల్లితో గొడవపడ్డాడు. క్షణికావేశానికి లోనైన అతను కర్రతో బలంగా ఆమె తలపై బాదడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనకు మృతురాలి చిన్న కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు లింగాల ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

కాలిబూడిదైన చేపల బోట్లు



మంటలకు కాలి బూడిదైన బోటు,బుట్లు

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం పుష్కర ఘాట్ దగ్గర బాటసారి వేసిన నిప్పురవ్వకు దాదాపు లక్షమేర ఆస్తినష్టం జరిగింది. ఆ గ్రామానికి చెందిన మత్స్యకారులు బోట్లు, పుట్లను ప్రస్తుతం కృష్ణానదిలో నీరు లేకపోవడంతో పుష్కరఘాట్ దగ్గర ఉంచారు. గుర్తుతెలియని బాటసారి చిన్న నిప్పురవ్వను చెత్తలో వేయడంతో అది పెరిగి మంటగా మారి పక్కనే ఉన్న బోట్లు, బుట్లపై పడడంతో అవి పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పక్కనే ఉన్న వలలను మంట తగలకుండా పక్కకు తీసేశారు.

మార్గదర్శిలో 'నల్ల' ఇంధనం!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సమాచారాన్ని అందించాల్సి ఉంటుంది. డిపాజిట్‌దారులు లిఖితపూర్వకంగా తెలిపే వివరాలను సీఐడీ అధికారులు మరోసారి క్షుణ్నంగా పరిశీలించి వాస్తవికతను నిగ్గు తేలుస్తారు. ఆర్బీఐ, కేంద్ర పరోక్ష పన్నుల బోర్డు నిబంధనలను ఎందుకు పాటించలేదు? అనే కోణాల్లో విచారణను చేయనున్నారు. తద్వారా నల్లధనం వ్యవహారాలపై ఒక నిర్ధారణకు వచ్చి తదుపరి చర్యలు చేపడతారు.

మూసివేసిన చిట్టీల నిర్వహణకు ప్రత్యేక అధికారి!

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించినందున మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థకు చెందిన 23 చిట్టీ గ్రూపులను మూసివేయాలని స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఇప్పటికే ఆదేశించింది. ఆ మేరకు చిట్టీ గ్రూపుల మూసివేత దాదాపు పూర్తయ్యింది. మరిన్ని గ్రూపులను మూసివేసే దిశగా అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఈమేరకు ఇప్పటికే గుర్తించిన అక్రమాలతో నివేదికను రూపొందిస్తున్నారు. మూసివేసిన చిట్టీల నిర్వహణ పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక అధీకృత అధికారిని నియమించడానికి సన్నద్ధమవుతున్నారు. మూసివేసిన చిట్టీల గ్రూపుల్లోని చందాదారులు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లకు చందాలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇప్పటికే చిట్టీ పాట పాడిన చందాదారులు మిగిలిన వాయిదాలను చెల్లించాలి. మూసివేసిన చిట్టీ గ్రూపుల చందాదారులకు వారి మొత్తాన్ని తిరిగి చెల్లించే ప్రక్రియ పర్యవేక్షణకు అధీకృత అధికారిని నియమిస్తూ త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.

ఉత్తమ సేవలందించిన ఫైర్ సిబ్బందికి పతకాలు

సాక్షి, హైదరాబాద్: ఉత్తమ సేవలందించిన అగ్నిమాపక శాఖ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు దక్కాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇస్తున్న పోలీస్ సేవాపతకాల్లో భాగంగా శౌర్యపతకం, మహోన్నత సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, కఠినసేవా పతకం, సేవా పతకం కేటగిరీల్లో ఉత్తమ పనితీరు ప్రదర్శించిన సిబ్బంది జాబితాను రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్ విడుదల చేశారు. డెక్కన్ మాల్‌లో అగ్నిప్రమాద సమయంలో ధైర్య సాహసాలతో పనిచేసిన ఫైర్ సిబ్బందిలో హైదరాబాద్ రీజనల్ ఫైర్ ఆఫీసర్ వి.పాపయ్య, సికింద్రాబాద్ ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మేన్ కె.సత్యనారాయణ, డ్రైవర్ ఆపరేటర్లు జె.నర్సింగ్‌రావు, పి.శ్రీధర్‌కు శౌర్యపతకాలు వచ్చాయి. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి సైతం అవార్డులు దక్కాయి. ఆ జాబితాను వెల్లడించలేదు.

ప్రేమికులపై పోలీస్‌స్టేషన్‌లోనే దాడి

రక్షణ కోసం ఎస్పీ కార్యాలయానికి పరుగులు

- ప్రేమ పెళ్లి చేసుకున్న జంటపై యువతి కుటుంబసభ్యుల ఆగ్రహం
- జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఘటన



గద్వాల క్రైం: పెద్దలను ఎదిరించి ప్రేమ పెళ్లి చేసుకున్న ఓ జంటపై యువతి కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లోనే దాడికి పాల్పడ్డ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. గద్వాలకు చెందిన ప్రశాంత్, మండలంలోని పూడూరుకు చెందిన శిరీష ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇరువురి ఇళ్లలో పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో ప్రశాంత్ తల్లిదండ్రులు రెండు నెలల క్రితం ఇద్దరికీ వివాహం చేద్దామని యువతి తల్లిదండ్రులతో మాట్లాడగా.. ఇద్దరి కులాలు వేరు కావడంతో అభ్యంతరం చెప్పారు. దాంతో మేజర్లయిన ప్రేమికులు ఈ నెల 8న ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. 9న కర్నూలు జిల్లా పాలబుగ్గ సమీపంలోని ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం ఇంటికి వచ్చేందుకు, తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలంటూ గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్‌కు మంగళవారం చేరుకున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫర్నిచర్ ధ్వంసం

పోలీసులు ఇరువురి కుటుంబసభ్యులను స్టేషన్‌కు పిలిపించి నచ్చజెప్పారు. అయితే యువతి కుటుంబసభ్యులు బలవంతంగా ఆమెను లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తోపులాట జరగ్గా.. ఆమె కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లోని ఫర్నిచర్ ధ్వంసం చేసి యువకుడి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. పోలీసు సిబ్బంది అడ్డుకోగా.. వెంటనే రక్షణ కోసం సమీపంలోని ఎస్పీ కార్యాలయానికి రోడ్డు వెంట ఆ ప్రేమజంట పరుగులు తీసింది. ఎస్పీ సృజన వద్దకు వెళ్లి జరిగిన విషయం వివరించారు. వెంటనే ఎస్పీ ఆ ఇద్దరూ మేజర్లు కావడంతో వారికి రక్షణ కల్పించే బాధ్యత పోలీస్‌శాఖపై ఉందన్నారు. భవిష్యత్‌లో వారిపై దాడి చేయడం, అవమానపర్చడం, విడదీసే ప్రయత్నం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఇరువురి కుటుంబ సభ్యులను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇప్పించారు. పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఘటనపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

లక్ష్మీబ్యారేజీలో 12 గేట్లు ఎత్తివేత



- ప్రాణహిత ఇన్‌ఫ్లో 39,560 క్యూసెక్కులు
- లక్ష్మి పంపుహౌస్‌లో ఏడు మోటార్లతో ఎత్తిపోతలు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీకి ఎగువ మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నది ద్వారా వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో మంగళవారం ఇంజనీరింగ్ అధికారులు లక్ష్మీబ్యారేజీలోని మొత్తం 85 గేట్లలో 12 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. ప్రాణహిత నది ద్వారా ఇన్‌ఫ్లో 39,560 క్యూసెక్కుల వరద తరలిరాగా 12 గేట్లు ఎత్తడంతో 36,360 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో దిగువకు తరలిపోయాయి. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 12.77 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహారాష్ట్ర నుంచి తరలివస్తున్న ప్రాణహిత నది వరదతో లక్ష్మీబ్యారేజీ వద్ద నిలిపిన జలాలు బ్యాక్‌వాటర్‌తో కాళేశ్వరంలో గోదావరి నది వరకు నిలిచాయి. కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద 7.460 మీటర్ల ఎత్తులో ఉన్న వరదనీటిని కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్‌లోని ఏడు మోటార్ల ద్వారా డెలివరీ సిస్టర్న్‌లో ఎత్తిపోస్తున్నారు. ఏడు మోటార్లతో 14,826 క్యూసెక్కులు నీరు ఎత్తిపోయగా అన్నారం (సరస్వతీ)బ్యారేజీకి తరలిపోతున్నాయి. ఈనెల 3వ తేదీనుంచి ఇప్పటి వరకు 5.90 టీఎంసీల నీరు సరస్వతీ బ్యారేజీకి చేరినట్లు ఇంజనీర్లు తెలిపారు. లక్ష్మీపంపుహౌస్ నుంచి వచ్చిన ప్రాణహిత జలాలతో అన్నారం బ్యారేజీలో జలకళ నెలకొంది. బ్యారేజీలో మొత్తం 66 గేట్లు ఉండగా అన్నీ మూసి ఉంచారు. బ్యారేజీలో 7.96 టీఎంసీల నీటినిల్వ ఉంది.

పైసల్లేక.. పనులు చేయలేక రాజీనామా

- చిన్నాపూర్ సర్పంచ్ లతాశ్రీ ఆవేదన

బుగ్గారం(ధర్మపురి): 'ఊరు బాగుపడాలని తెలిసినవారి దగ్గర అప్పు తెచ్చి అభివృద్ధి పనులు పూర్తి చేయించినం.. 12 నెలలైనా బిల్లులు మంజూరు కావట్లే.. ఖాతాలో నయాపైసా లేదు.. సిబ్బందికి వేతనాలు ఇవ్వలేకపోతున్నం.. అందుకే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్న..' అని జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామ సర్పంచ్ దమ్మ లతాశ్రీ ప్రకటించారు. వానాకాలం వచ్చినా పారిశుధ్య పనులు చేపట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయక, వీధి దీపాలు ఏర్పాటు చేయలేక గ్రామస్తులతో మాటలు పడాల్సి వస్తోందని వాపోయారు. తమ గ్రామం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023కు ఎంపికవడంతో.. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులు ఒత్తిడి చేయడంతో భరించలేక సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నానని స్పష్టం చేశారు. రాజీనామా లేఖను డీపీవో దేవరాజుకు అందజేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగానే తన పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. కాగా, బీఆర్‌ఎస్ మద్దతుతో సర్పంచ్‌గా గెలిచిన ఓ మహిళా ప్రజాప్రతినిధి.. ప్రభుత్వ వైఖరికి నిరసనగా పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.



డీపీవోకు రాజీనామా లేఖ అందజేస్తున్న సర్పంచ్ దమ్మ లతాశ్రీ

ఇద్దరిని మింగిన ఇసుక కుంట

- స్నానం చేసేందుకు కుంటలో దిగిన చిన్నారులు
- బురదలో ఇరుక్కుని మృత్యువాత



కేశావత్ గణేష్



ముడావత్ శివ

హన్వాడ: వ్యవసాయ పొలంలో స్నానం చేసేందుకు దిగి బురదలో ఇరుక్కుపోయి ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా చిర్మల్ కుచ్చతండాలో చోటు చేసుకుంది. హన్వాడ మండలం చిన్నదర్పల్లి పరిధిలోని చిర్మల్ కుచ్చతండాకు చెందిన ముడావత్ రవి కుమారుడు శివ (9), అదే గ్రామానికి చెందిన కేశావత్ గోపి కుమారుడు గణేష్ (9) చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరిద్దరూ మహబూబ్‌నగర్‌లోని మోడల్ బేసిక్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నారు. బోనాల పండుగ సందర్భంగా మంగళవారం పాఠశాలకు సెలవు ఇవ్వడంతో చిన్నారులిద్దరూ తండాలో ఉండిపోయారు. కాగా మధ్యాహ్నం ఆడుకుంటూ తండా సమీపంలోని నందిపేట ఆంజనేయులు వ్యవసాయపొలం వద్దకు వెళ్లారు. అక్కడ అక్రమ ఇసుక తయారీ కోసం తోడిన నీటికుంటలో స్నానం చేసేందుకు దిగారు. కుంట లోతుగా ఉండటంతో పాటు బురదగా ఉండడంతో ఇద్దరూ అందులో చిక్కుకుని మునిగిపోయారు. చిన్నారుల కోసం తల్లితండ్రులు వెతుకుతూ తండా సమీపంలోని నీటికుంటవైపు వెళ్లగా గట్టుపై పిల్లల దుస్తులు కనిపించాయి. దీంతో కుంటలో వెతకడంతో ఇద్దరి మృతదేహాలు బయటపడ్డాయి. విగతజీవులుగా మారిన చిన్నారులను చూసిన వారి తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ రోదించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవినాయక్ పేర్కొన్నారు. అయితే ఇద్దరు చిన్నారులను మింగిన నీటి కుంటను కొందరు అక్రమార్కులు ఫిల్టర్ ఇసుక తయారీకి తోడినట్లుగా తండావాసులు ఆరోపిస్తున్నారు.

జీవో 72ను రద్దు చేయాలి

- ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టులో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: కొత్త మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను రాష్ట్ర విద్యార్థులకే రిజర్వు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 72ను కొట్టివేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారం క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం 2014, జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ కానున్నాయి. ఈ మేరకు జూలై 3న జీవో నంబర్ 72ను విడుదల చేసింది. అంతకు ముందు 85 శాతం మాత్రమే స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15 శాతం అన్‌రిజర్వుడుగా ఉండేది. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా పోటీ పడేవారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఏపీ విద్యార్థులకు పోటీపడే అవకాశం ఉండదు. దీంతో ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన పి.సాయిసిరిలోచన, పి.చంద్రశేఖర్ తెలంగాణ హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. జీవో 72 చట్టవిరుద్ధమని, కొట్టివేయడంతో పాటు కౌన్సిలింగ్‌లో పాత విధానాన్నే అనుసరించేలా ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు వినిపించేందుకు సమయం కావాలని ప్రభుత్వం తరఫున ఏఏజీ కోరడంతో ధర్మాసనం విచారణను నేటికి వాయిదా వేసింది.

యూసీసీ చట్టమైతే కేసీఆర్ దేశం వీడొచ్చు

- ఎంపీ అర్వింద్

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌లో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ఆమోదం పొందాక.. అది ఇష్టం లేకపోతే సీఎం కేసీఆర్ దేశాన్ని విడిచి పోవచ్చునని.. కావాలనుకుంటే పాకిస్తాన్ కూడా వెళ్లిపోవచ్చని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యానించారు. అది చట్టంగా మారి దేశంలో అమల్లోకి వచ్చాక కేసీఆర్ బహిష్కరించే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ మద్దతు లేకుండానే ఈ బిల్లు పాసవుతుందని వ్యాఖ్యానించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ యూసీసీని వ్యతిరేకించే పేరుతో ముస్లిం పెద్దలతో కేసీఆర్ భేటీ వెనుక ఆంతర్యం వేరే ఉందన్నారు. కర్ణాటక ఎన్నికల తర్వాత ముస్లిం ఓటింగ్ అంతా కాంగ్రెస్ వైపు మళ్లుతుందనే భయంతో.. వారిని మంచి చేసుకునేందుకే ఈ సమావేశం జరిగిందన్నారు.

ఎస్‌ఓ బాధ్యతలు మాకొద్దు..

- ఆందోళనలో కేజీబీవీ విద్యార్థినులు
- ఇళ్లకు వెళ్లినవారు పాఠశాలకు రాలె..
- కేజీబీవీ ఎస్‌ఓ ఇన్‌చార్జి బాధ్యతలకు సీఆర్‌టీల దూరం
- పరిస్థితులను చక్కబెట్టే పనిలో అధికారులు



పాఠశాలలో సీఆర్‌టీలతో సమావేశమైన జీసీడీఓ శుభలక్ష్మి

అమరచింత : అమరచింత కేజీబీవీలో ఆహారం వికటించి 60 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనతో పాఠశాల ఎస్‌ఓ స్వప్నరాణిని విధుల నుంచి తొలగించారు. ఇన్‌చార్జి ఎస్‌ఓగా బాధ్యతలు అప్పగించే యత్నాలు విఫల మవుతున్నాయి. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌టీలలో ఒకరికి ఎస్‌ఓగా ఇన్‌చార్జి ఇవ్వాలని జీసీడీఓ శుభలక్ష్మి, ఎంఈఓ భాస్కర్ సింగ్‌లు మంగళవారం సీఆర్‌టీలతో సమావేశమయ్యారు. ఎస్‌ఓగా బాధ్యతలు తమకొద్దని చేతులెత్తాశారు. కేజీబీవీలో ఇంటర్ వరకు కొనసాగుతుండటంతో విద్యార్థినుల చదువులతో పాటు పాఠశాల నిర్వహణ బాధ్యత అధికబారం ఉంటుందని జీసీడీఓకు సీఆర్‌టీలు విన్నవించారు. సీఆర్‌టీలలో సీనియర్‌గా ఉన్న వారిని ఇన్‌చార్జిగా నియమిస్తామని, మరోమారు ఆలోచించుకోవాలని సూచించారు.

పాఠశాల మొత్తంలో 270 మంది విద్యార్థినులుండగా మంగళవారం 65 మంది మాత్రమే హాజరయ్యారు. త్వరలో సమస్యలను పరిష్కరించి విద్యార్థినులు అందరూ పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని జీసీడీఓ వెల్లడించారు.

వర్షాకాలానికి సన్నద్ధం కావాలి



సమీక్షలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ సీఎండీ రఘుమారెడ్డి

విద్యుత్ శాఖ సీఎండీ రఘుమారెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వర్షాకాలంలో వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్‌శాఖ అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని ఆ శాఖ సీఎండీ రఘుమారెడ్డి అధికారులకు సూచించారు. శాఖ పనితీరుపై మంగళవారం స్థానిక విద్యుత్ భవన్‌లోని మీటింగ్‌హాల్‌లో ఉమ్మడి జిల్లా యంత్రాంగంతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో రైతులకు 24 గంటలు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అంతరాయం లేకుండా తగుచర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు ప్రతినెలా విద్యుత్ బిల్లుల వసూలుపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా బిల్లులు వసూలు చేయాలని సూచించారు. పెండింగ్ బిల్లులు వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టి వసూలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. వినియోగదారులకు తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శాఖపై పని ఒత్తిడి చాలా ఉందని, వచ్చే నెల కొత్త ఏఈలు, జూనియర్ లైన్‌మెన్ల రిక్రూట్‌మెంట్ కానున్నారని తెలిపారు. వీరి రాకతో శాఖలో ఉద్యోగులపై పని భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్ కో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీజీఎం భిక్షపతి, రాములు, గోపాల్, మదన్‌మోహన్, మహబూబ్‌నగర్ ఎస్‌ఈ శ్రీరాంమూర్తితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్‌ఈలు, ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే ప్రజల వద్దకే పాలన



యన్మన్‌గండ్లలో అనిరుధ్‌రెడ్డికి పాదయాత్రలో మహిళల నీరాజనం.

నవాబుపేట: బీఆర్‌ఎస్ పాలనలో పేదలు ప్రభుత్వ పథకాల కోసం అధికార పార్టీ నాయకుల చుట్టూ తిప్పుకుంటున్నారని, కాంగ్రెస్ అధికారంలో రాగానే ప్రజల వద్దకే పాలన వస్తుందని పీసీసీ ప్రధానకార్యదర్శి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో ప్రజాహిత పాదయాత్ర మూడోరోజు రుక్కంపల్లి, యన్మన్‌గండ్ల, రుద్రారం, కొండాపూర్ గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందాలంటే అధికార పార్టీలో ఉండాలని, ఇలాంటి దుర్మార్గపు అలవాటును తీసివేసి ప్రజల చెంతకే ప్రభుత్వం తీసుకొచ్చి సేవలు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో మారుమూల గ్రామాల వారికి వైద్య సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తానన్నారు. ప్రతి గ్రామంలోనూ సొంతంగా వలంటీర్‌ను ఏర్పాటు చేసి వారి ద్వారా హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో వైద్యం అందించే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు.

మైసమ్మ మీద ఒట్టేసి చెప్పే దమ్ముందా..?

జడ్చర్లలో ప్రాజెక్టు పేరుతో మట్టిని అమ్ముకున్న అధికార పార్టీ నాయకులకు గ్రామాల అభివృద్ధిపై దృష్టి లేదని, కేవలం ధనార్జనపైనే వారి దృష్టి ఉందన్నారు. చెరువుల్లో నల్లమట్టి అమ్ముకోలేదని పర్వతాపూర్ మైసమ్మ మీద ఒట్టేసి చెప్పే ధమ్ము బీఆర్‌ఎస్ నాయకులకు ఉందా? అని ఆయన ప్రశ్నించారు. అధికారికంగా పన్ను చెల్లిస్తే లక్షాది రూపాయలు పంచాయతీల ఖాతాలో జమ ఉండేవని ఆయన అన్నారు. రాజాపూర్ మండలంలో నిరుపేద చిన్నారికి గుండె ఆపరేషన్ కోసం ఆర్థిక సహాయం అందిస్తానని తెలిపారు. ఆయన వెంట డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాసుయాదవ్, ఎంపీటీసీ తులసీరాంనాయక్, నర్సింహులు, హమీద్, ఆంజనేయులు, కుమార్, సురేష్, నవాజ్‌రెడ్డి, డాక్టర్ మీనాక్షి, జ్యోతి, రాజు, అశోక్, వెంకటయ్య ఉన్నారు.

గొర్రెల యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రాంచందర్‌నాయక్

వెల్దండ: రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమల ఆర్థికాభివృద్ధి కోసం అందిస్తున్న గొర్రెల యూనిట్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రాంచందర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి, రాఘయపల్లి గ్రామాల్లో ప్రభుత్వం అందించిన గొర్రెల యూనిట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన గొర్రెల యూనిట్లను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. లబ్ధిదారులందరికీ నాణ్యమైన గొర్రెలను అందించడానికి కృషి చేస్తామన్నారు. 12మంది లబ్ధిదారులు చిన్న గొర్రెలు అందిస్తున్నట్లు ఆరోపణలు చేయడంతో విచారణ చేస్తామని పేర్కొన్నారు. గొర్రెలకు వాక్సినేషన్, దాణా అందించాలన్నారు. రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులు బ్యాంకుల్లో డీడీలు చెల్లించాలని, విడతల వారీగా యూనిట్లను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ జగదీశ్వరి, సర్పంచులు అచ్చాలు, ఎంపీటీసీ మోతిలాల్‌నాయక్, గాలమ్మ, డాక్టర్ శ్యామ్‌సుందర్, గొర్రెల సంఘం అధ్యక్షుడు కొండల్‌యాదవ్, బాలయ్య, నాయకులు రామస్వామి, బాల్‌లక్ష్మి, తిరుపతయ్య, తదితరులు ఉన్నారు.



వెల్దండ మండలం చౌదర్‌పల్లిలో గొర్రెల యూనిట్లను పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ రాంచందర్‌నాయక్.

జాతీయస్థాయికి మక్తల్ క్రీడాకారుల ఎంపిక



జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన మక్తల్ విద్యార్థినులు

మక్తల్: టగ్ ఆఫ్ వార్ క్రీడల్లో మక్తల్‌కు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు రాష్ట్ర అసోషియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం తెలిపారు. జూన్ 25న హైదరాబాద్‌లోని గౌలిపుర గ్రౌండ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి టగ్ ఆఫ్ వార్‌లో అండర్–15 బాలికల విభాగంలో అనుష, శ్రావణి, శివమ్మ, కవిత, మౌనిక, స్రవంతి, అండర్–17 విభాగంలో స్వప్న, లలిత, కవిత, పాయల్, అండర్–13 విభాగంలో నవిత ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 20వ తేదీ నుంచి చెన్నై (తమిళనాడు)లో జరగనున్న జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను గౌరవ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్ అభినందించారు.

పాలమూరు లక్ష్యం 327

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో హెచ్‌సీఏ బీ–డివిజన్ రెండురోజుల లీగ్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ జట్టు డెక్కన్ ఆర్‌సలన్‌తో తలపడింది. తొలిరోజు డెక్కన్ ఆర్‌సలన్ 82.2 ఓవర్లలో 326 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్లలో షాదాబ్ 4, డేవిడ్ 2 వికెట్లు తీశారు. 327 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జిల్లా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ కోల్పోయి 47 పరుగులు చేసింది. బుధవారం విజయానికి మరో 280 పరుగులు చేయాల్సి ఉంది.

రెండో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

- తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెండో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దై పర్మినెంట్ కొలువులు వస్తాయని, కోటి ఆశలతో ఎదురు చూస్తున్న రెండో ఏఎన్‌ఎంలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం తీర్పును ప్రభుత్వం అమలు చేయకపోవడం విడ్డూరమని అన్నారు. వారు డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపికయ్యారని, వారికి ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలన్నారు. వారు చేసిన కృషి వల్ల దేశంలో 14వ స్థానంలో ఉన్న తెలంగాణ మూడో స్థానంలోకి వచ్చిందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఎంహెచ్‌ఓ కృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జయమ్మ, అన్నపూర్ణ, శోభారాణి, సూర్యకళ, భాగ్యమ్మ, రేణుక, సునిత, నాగమని, లలిత, గౌరీ, కృష్ణవేని, వెంకటేశ్వరమ్మ, అరుణ, జ్యోతి, గిరిజ. కవిత, చిన్నమ్మ, పుష్పలత, ఎల్లమ్మ, మాధవి, గౌసియా బేగం, ఇందిర, బాలేశ్వరి, రాములమ్మ, యాదమ్మ, సుజాత, సువర్ణ, రాధిక పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధిపై డాక్యుమెంటరీ

సీఎంకు అందజేసిన జీసీసీ చైర్మన్ రామావత్ వాల్యానాయక్

బాలానగర్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం రాష్ట్రంలో గిరిజనుల అభ్యున్నతిపై గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జీసీసీ చైర్మన్ రామావత్ వాల్యానాయక్ డాక్యుమెంటరీ తయారు చేశారు. మంగళవారం రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌తో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిసి డాక్యుమెంటరీని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ అనంతరం 9సంవత్సరాలుగా రాష్ట్రంలోని తండాలలో, గిరిజన గూడాలలో జరిగిన అభివృద్ధి గురించి ముఖ్యమంత్రికి వివరించారు. బాలానగర్ మండలం నేలబండతండాలో గతంలో నిద్రచేసిన కేసీఆర్, అక్కడి గిరిజనుల కష్టాలను చూసి కల్యాణలక్ష్మి పథకం తీసుకువస్తామని ఆనాడే ప్రకటించారని గుర్తు చేశారు. గిరిజనుల అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ దళపతి చేసిన కృషికి గిరిజనులు రుణపడి ఉంటారని తెలిపారు.

